నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, సోమవారం 8 జూలై 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

చెక్కు అందజేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఆపదలో అండగా ఉంటాం

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, జూలై 7 : ఆపదలో అండగా ఉంటామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఆదివారం అలంపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అలంపూర్ మండలం లింగనవాయికి చెందిన శ్యామల కుటుంబానికి రూ.60వేలు, భీమవరానికి చెందిన షాలిబీ కుటుంబానికి రూ.23వేలు, సుల్తానాపురం గ్రామానికి చెందిన వెంకటస్వామి కుటుంబానికి రూ.30 వేలు, అలంపూర్‌కు చెందిన సావిత్రమ్మ కుటుంబానికి రూ.12,500, రత్నమ్మ కుటుంబానికి రూ.2లక్షలు, సింగవరం గ్రామానికి చెందిన రామాంజనేయులు కుటుంబానికి రూ.24వేల సీఎం సహాయ నిధి చెక్కులను బాధిత కుటుంబాలను కలిసి అందజేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఆధునిక వైద్యాన్ని అందుబాటులోకి తెస్తాం

- మహబూబ్‌నగర్‌లో 1,225 పడకలతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం
- ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధిపై 9న సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- దవాఖాన పనులు పరిశీలించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

దవాఖాన మ్యాప్, పనులను పరిశీలిస్తున్న మంత్రి దామోదర

మహబూబ్‌నగర్, జూలై 7 : అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్న మహబూబ్‌నగర్ ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణ పనులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న 1,003 పడకల దవాఖాన నిర్మాణ పనులను పరిశీలించి కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ జీవన్, రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ ఇంజినీరింగ్ అధికారి నిర్మాణ వివరాలను మ్యాప్ ద్వారా వివరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. డిసెంబర్ నాటికి దవాఖాన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 1,003 పడకలు, ఎంసీహెచ్‌లో 220 బెడ్లతోపాటు అదనంగా వైద్యులు, ఫార్మసిస్టులు, వైద్య సిబ్బందికి తగిన వసతులతో దవాఖాన నిర్మాణాన్ని చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక వసతులతో మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్ మెడికల్ కాలేజీల్లో అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. పీహెచ్‌సీ, సబ్ సెంటర్, ఏరియా దవాఖానల్లో కావాల్సిన సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఈనెల 9న సీఎం ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగంతో చర్చిస్తారన్నారు. ప్రాజెక్టులు, విద్య, వైద్యం, పర్యాటకరంగ అభివృద్ధిపై సమీక్ష చేయనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో వైద్య, విద్యావ్యవస్థలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, మెడికల్ కళాశాల డైరెక్టర్ రమేశ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణ, జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ జీవన్ తదితరులున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తాం

- మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి
- ఎమ్మెల్యేలు, ఎంపీ, అధికారులతో సమీక్ష

మహబూబ్‌నగర్, జూలై 7 : పెండింగ్ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, పర్యాటకం, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజ నర్సింహ మాట్లాడుతూ మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల్లోని 19 నియోజకవర్గాలు, 71 మండలాల 12.30 లక్షల ఎకరాలకు సాగునీళ్లు అందించేందుకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేస్తామన్నారు. అంతేకాకుండా ప్రాజెక్టు ద్వారా పారిశ్రామిక సంస్థలు, హైదరాబాద్‌తోపాటు 1,226 గ్రామాలకు నీళ్లు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పర్యావరణ అనుమతులతోపాటు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. నార్లాపూర్, వట్టెం, కరివెన, ఏదుల రిజర్వాయర్ పనులు దాదాపు పూర్తయ్యాయని, ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు 60శాతం పూర్తయినట్లు వెల్లడించారు. ప్రాజెక్టు ప్రతిపాదిత వ్యయం రూ.35,200 కోట్ల నుంచి రూ.55వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను కూడా పూర్తి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ కోరారు. వైద్యరంగంలో పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేయాలని, దవాఖానల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సిటీస్కాన్, ఎక్స్‌రే అన్ని పరీక్షలు నిర్వహించేలా చూడాలని ఎమ్మెల్యేలు కోరారు. విద్యాలయాలను, దవాఖానలను కలెక్టర్లు సందర్శించడం ద్వారా పారదర్శకత పెరుగుతుంద న్నారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, రాజేశ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వంశీకృష్ణ, మేఘారెడ్డి, సాగునీటి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, కలెక్టర్లు విజయేందిర బోయి, బదావత్ సంతోష్, సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.

పైసా వసూల్

- వ్యాపార కేంద్రాలుగా ప్రైవేట్ పాఠశాలలు
- నో అడ్మిషన్ పేరుతో డోనేషన్ల వసూలు
- స్కూళ్లలోనే యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ విక్రయాలు
- అర్హత లేని వారితో విద్యాబోధనలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

విజ్ఞతతో ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉన్నది. అంతటి ప్రాధాన్యత కలిగిన చదువును కొందరు వ్యాపారంగా మలుచుకొంటున్నారు. ధనార్జనే ధ్యేయంగా ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తూ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు విద్యతో దందా చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి హంగులు ఆర్భాటాలతో ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేయడమే కాకుండా నోట్ బుక్కులు, పాఠ్యపుస్తకాలు, డ్రస్సులను సైతం పాఠశాలల్లోనే విక్రయిస్తూ వ్యాపార కేంద్రాలుగా మారాయి. ఇదంతా విద్యాశాఖ అధికారులకు తెలిసినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

- నారాయణపేట, జూలై 7

పవిత్రమైన విద్యాలయాలు ధనార్జన కేంద్రాలుగా మారాయి. కొందరు ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు వేలకువేలు ఫీజులు దండుకోవడమే కాకుండా నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలల్లోనే యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు విక్రయించడంతోపాటు అర్హత లేని వారితో విద్యాబోధన చేయిస్తున్నారు. ఒక వైపు బడి బాట పేరుతో ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు, మరోవైపు ప్రైవేట్ పాఠశాలల్లో ఇంత తతంగం జరుగుతున్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ముక్కు పిండి ఫీజు వసూలు..

ధనార్జనే ధ్యేయంగా నిర్ణీత ఫీజులకు మించి వేలకు వేల ఫీజులను ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ బడులకంటే ప్రైవేట్ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని భావిస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు ముఖ్యమని స్థాయికి మించి ఎక్కువ మొత్తంలో ఫీజులు చెల్లించేందుకు కూడా వెనకాడడం లేదు. ఇదే అదునుగా భావించిన కొన్ని పాఠశాలల యాజమాన్యాలు దొరికిందే తడువు ఎలాగైనా సరే డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. తమ పాఠశాలలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ఏకంగా నో అడ్మిషన్ బోర్డులు పెట్టి మరీ లోలోపల డొనేషన్లను వసూలు చేస్తున్నట్లు సమాచారం. అంతే కాకుండా పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్ బుక్కులు విక్రయించరాదని నిబంధనలు ఉన్నప్పటికీ అవేమీ తమకు వర్తించవన్నట్లుగా నిబంధనలకు పాతరేస్తూ పాఠశాలలోనే దుకాణాలు తెరిచేస్తున్నారు. పాఠశాలల్లో నోట్ బుక్కులు విక్రయించడం వల్ల తమ ఉపాధికి గండిపడుతుందని నారాయణపేటకు చెందిన పలువురు బుక్ సెంటర్ల నిర్వాహకులు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో నోట్ బుక్కులు, పాఠ్య పుస్తకాలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఏకంగా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారంటే వ్యాపారం ఏ విధంగా కొనసాగుతుందో ఇట్టే అర్థమవుతుంది. మరికొన్ని పాఠశాలల యాజమాన్యాలు అయితే ఒక అడుగు ముందుకేసి తమ పాఠశాలల్లో ఐఐటీ, టెక్నో, ఒలంపీయాడ్, నీట్ వంటి వాటికి ప్రత్యేక తరగతులు చెబుతామంటూ కార్పొరేట్ హంగులతో లక్షల్లో ఫీజులను వసూలు చేస్తున్నాయి. అడ్మిషన్ సమయంలో మాత్రం ప్రావీణ్యులైన ఉపాధ్యాయులు, సిబ్బంది పని చేస్తున్నట్లుగా చెబుతూ తరగతులు ప్రారంభమైన తర్వాత బోధించే అర్హత లేని ఇంటర్మీడియట్, డిగ్రీ ఫెయిలైన నిరుద్యోగులను విద్యాబోధనకు పెట్టుకుంటున్నారు. అర్హత కలిగిన వారిని నియమించుకుంటే ఎక్కువ మొత్తంలో వేతనం ఇవ్వాల్సి వస్తుందని, తక్కువ మొత్తంలో వేతనాలకు పనిచేసే వారిని నియమించుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో యూనిఫాం, పుస్తకాలు విక్రయించరాదనే నిబంధనలను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పక్కనపెట్టి ఒక్కో పాఠశాల యాజమాన్యం ఒక్కో బట్టల దుకాణం వ్యాపారితో ఒప్పందం చేసుకొని వేల రూపాయలను దుస్తుల కోసం వసూలు చేస్తున్నారు. ఇక పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులను తమ పాఠశాలల పేర్లతో ముద్రించి పాఠశాలల్లోనే విక్రయిస్తున్నారు. వీటికి తోడు అధిక మొత్తంలో రవాణా చార్జీలను వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇదంతా తెలిసినా విద్యాశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. పలు పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డుల పేరుతో డొనేషన్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పాఠశాలలను తనిఖీ చేయాల్సిందిగా అధికారులకు సూచించాం.

- అబ్దుల్‌ఘని, డీఈవో, నారాయణపేట

దినదిన గండం

సర్కారు బడులను బలోపేతం చేస్తున్నామన్న ప్రభుత్వ పెద్దల మాటలు నీటిమీద రాతలేనని కొన్ని పాఠశాలలు రుజువు చేస్తున్నాయి. కనీస సౌకర్యాలు అటుంచితే 50 ఏండ్ల కిందట నిర్మించిన కొల్లాపూర్ మండలం నార్లాపూర్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరి దినదిన గండంగా మారింది. ఎప్పుడు కూలిపడుతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో విద్యార్థులను పంపించేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. కొత్త పాఠశాలను నిర్మించాలని, లేదంటే భవనం మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన నార్లాపూర్ ప్రభుత్వ పాఠశాల

- 50 ఏండ్ల కిందట నిర్మించిన నార్లాపూర్ పాఠశాల
- పెచ్చులూడిపడుతున్న వైనం
- గదుల్లోకి చేరుతున్న వర్షపు నీరు
- విద్యార్థులను పంపించలేం అంటున్న తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు, ప్రభుత్వం

కొల్లాపూర్, జూలై 7 : ప్రాణాలను ఫణంగా పెట్టి కూలిపోయే దశలో ఉన్న పాఠశాలకు తమ పిల్లలను పంపించబోమని కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో 50 ఏండ్ల కిందట నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 118 మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల కూలిపోయే స్థితిలో ఉన్నది. వర్షాల ధాటికి పెచ్చులూడుతున్నాయి. శిథిలావస్థకు చేరిన పాఠశాలకు మా పిల్లలను పంపించాలంటే భయంగా ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. వర్షం వచ్చిన ప్రతీసారి పిల్లలు ఎలా ఉన్నారోనని భయాందోళనకు గురికావాల్సి వస్తుందంటున్నారు. భవనం పైకప్పు నుంచి వర్షపు నీరు కారుతున్నది. ఉపాధ్యాయులు కూడా భయంగానే పిల్లలకు విద్యాబోధన చేస్తున్నారు.

బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్న విద్యార్థులు

పాఠశాలకు పంపాలంటే భయమైతుంది..

మా పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపించేంత డబ్బులు మాకాడ లేవు. గవర్నమెంట్ స్కూల్‌కు పిల్లలను పంపించేందుకు చానా కష్టాలు పడుతుండం. కానీ స్కూల్ కట్టి చానా ఏండ్లు అయ్యింది. ఎప్పుడు కూలిపడుతుందో తెల్వదు. అందుకే పిల్లలను పంపించాలంటే భయమైతుంది. సారోళ్లు పాఠశాల భవనం మారిస్తే బాగుంటది.

- నిరంజన్, విద్యార్థి తండ్రి

నార్లాపూర్ పాఠశాల దుస్థితి..

పెచ్చులూడుతున్నాయి..

వర్షం వచ్చిన ప్రతీసారి బడిలోకి నీళ్లు వస్తున్నాయి. భవనం పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడు ఎవరి మీద కూలుతుందో అని భయపడుతున్నాం. ఏమవుతుందోనని మా తల్లిదండ్రులు మమ్మల్ని పాఠశాలకు పంపిస్తలేరు. కొత్త బడిని కట్టిస్తే బాగుంటుంది.

- భాను, విద్యార్థి

త్వరలో మరమ్మతులు చేయిస్తాం..

అమ్మ ఆదర్శ పాఠశాల కింద మరమ్మతులు చేపడుతాం. రూ.లక్ష మంజూరు కోసం నివేదికలు పంపించాం. ఇంజినీరు అధికారిని పంపించి పాఠశాల పరిస్థితిపై అంచనా వేయిస్తాం. పాఠశాల శిథిలావస్థకు చేరడంతో పెచ్చులూడుతున్న గదిలో విద్యార్థులను కూర్చోబెట్టడం లేదు. ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటాం.

- చంద్రుడు, ఎంఈవో, కొల్లాపూర్

విద్యార్థుల అగచాట్లు

- బీటీ ఉన్నా సమయానికి రాని బస్సులు
- రోడ్డు లేని గ్రామాల వైపు కన్నెత్తి చూడని సర్వీసులు
- సైకిళ్లు, ఆటోలు, ప్రైవేట్ వాహనాలే గతి..

నారాయణపేట, జూలై 7 : రోడ్డు లేని గ్రామాలకు బస్సు నడపలేమని చెబుతూ ఆయా గ్రామాలవైపు కన్నెత్తి చూడని ఆర్టీసీ బస్సులు.. రోడ్డు సౌకర్యం మంచిగా ఉన్న గ్రామాలకు కూడా బస్సులను నడిపించడం లేదు.. ఒక వేళ కొన్ని గ్రామాలకు బస్సులను నడిపిస్తున్నా అవి సరైన వేళకు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్న పరిస్థితి నారాయణపేట జిల్లాలో నెలకొంది. నిరుపేద విద్యార్థులు తప్పని పరిస్థితిలో కాలిబాటన వెళ్లి సర్కారు బడుల్లో విద్యను అభ్యసిస్తుండగా, కొంత ఆర్థికస్థోమత కలిగిన విద్యార్థులు మాత్రం తమ గ్రామాలకు వచ్చే ప్రైవేట్ బస్సులను దృష్టిలో ఉంచుకొని ఆయా ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు పొంది విద్యను అభ్యసిస్తున్నారు. బస్సుల రాకపోకలకు వేళపాళా లేకపోవడంతో రోడ్లపై వెళ్లే వాహనదారులను లిఫ్ట్ అడుగుతున్న పరిస్థితులు నిత్యం కనిపిస్తున్నాయి. బస్సులను సమయానికి నడపాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు అధికారులకు విన్నవించినా అవి ఒకటి రెండు రోజులకే పరిమితమవుతున్నాయి. నారాయణపేట జిల్లాలోని ఊట్కూర్ మండలంలోని పెద్దపొర్ల, కొత్తపల్లి, కొల్లూరు, సమస్తపూర్, వల్లంపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో కాలినడకన పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్నారు. మాగనూర్ మండలంలోని కొత్తపల్లి, తాలంకేరి గురురావు లింగంపల్లి, వర్కూర్ గ్రామాల నుంచి వందల మంది విద్యార్థులు కాలినడకన మాగనూర్‌కు వస్తుంటారు. తాలంకేరి గురురావు లింగంపల్లి, వర్కూర్ గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు నడుస్తున్నా సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొన్నది. కొన్ని గ్రామాల్లో అయితే తమ పిల్లలను కాలిబాటన నడిపించలేక ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యంతో మాట్లాడి తమ గ్రామాలకు ప్రైవేట్ బస్సులు వచ్చే విధంగా చూసుకొని, తమ పిల్లలను సర్కారు బడి మాన్పించి ప్రైవేట్ బడుల్లో చదివిస్తున్నారు. ఇక సాయంత్రం సమయంలో అయితే సరిపడా బస్సులు లేకపోవడంతో బస్సుల్లో సీటింగ్ కెపాసిటీకి మించి రెండు, మూడింతలు ఎక్కుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని సందర్భాల్లో అయితే బస్సు డోర్ల వద్ద వేళాడుతూ వెళ్తున్న పరిస్థితులు ఉన్నాయి. పాఠశాలల పునః ప్రారంభోత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఇటీవల స్థానిక ఆర్టీవో ప్రైవేట్ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించడం మంచిగా ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సుల్లో వేలాడుతూ విద్యార్థులు ప్రయాణిస్తున్నా మాత్రం చర్యలు తీసుకోవడంలో మిన్నకుండా ఉండడం చూస్తుంటే ప్రైవేట్ రంగంపై ఒక విధంగా ప్రభుత్వ రంగంపై మరో విధంగా ఆర్టీవో తీరు ఉందని విమర్శలు వస్తున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే నష్టం ఎవరికనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని స్కూల్ సమయంలో విద్యార్థులకు సరిపడా బస్సులను నడపాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులపై ఉన్నది. అదే సమయంలో బస్సుల్లో మోతాదుకు మించి ప్రయాణాలు చేస్తుంటే చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్న ఆర్టీవో సైతం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది.

ఓబ్లాపూర్ నుంచి మాగనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

చిమనగుంటపల్లి తూర్పుతండా నుంచి సైకిల్, కాలినడకన, స్కూటీపై వెళ్తున్న విద్యార్థులు

బడిలేని తూర్పుతండా

- రోడ్డు సౌకర్యం కూడా లేని వైనం
- అంగన్‌వాడీని సైతం ఏర్పాటుచేయని ప్రభుత్వం
- చదువుకోవాలంటే తప్పనినడక
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వనపర్తి, జూలై 7 : వనపర్తి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని చిమనగుంటపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో తూర్పుతండా ఉన్నది. ఈ తండాకు ఇప్పటి వరకు రోడ్డు సౌకర్యం లేదు. తండావాసులు తమ పిల్లలను చదివించాలంటే ప్రాథమిక పాఠశాల కూడా లేదు. కనీసం ఓనమాలు నేర్పించడంతోపాటు బడి అలవాటు అయ్యేందుకు అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. దీంతో గిరిజనులు తమ పిల్లలను చదివించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి నుంచి ఉన్నత విద్యను అభ్యసించే దాదాపు 50 మంది విద్యార్థులు ప్రతి రోజూ మూడు కిలో మీటర్లు రోడ్డు వరకు నడిచి వచ్చి సమీప గ్రామాల్లోని పాఠశాలలు, కళాశాలలకు బస్సులు, ఆటోల్లో వెళ్తున్నారు. అయితే కొద్ది మంది తండావాసులు తమ పిల్లలకు చదువు నేర్పించాలనే ఉద్దేశంతో ప్రైవేట్ ఆటోలు, వాహనాలు ఏర్పాటు చేసుకొని పాఠశాలలకు పంపిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. తమ గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని గ్రామానికి వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తండావాసులు ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకులు ఎన్నికలప్పుడు మాత్రమే మా తండాకు వస్తారని వచ్చి హామీలివ్వడం తప్పా చేసిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిరాయి ఆటోలో ప్రభుత్వ బడికి వెళ్తున్న చిన్నారులు

పాఠశాల ఏర్పాటు చేయాలి

కొన్నేండ్లుగా మా తండాకు రోడ్డు వేయాలని, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని తండాకు వచ్చే ప్రతి ఒక్కరినీ కోరుతున్నాం. తండాలో పాఠశాల లేకపోవడంతో పిల్లలను చదివించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా పిల్లలు రోడ్డు వరకు నడిచివెళ్లేందుకు కూడా సక్రమంగా రోడ్డు లేక పొలాలు, గట్ల వెంబడి మెయిన్ రోడ్డు వరకు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తున్నది. పొద్దుగాల పోయేటప్పుడు బాగానే ఉన్నా సాయంత్రం పిల్లలు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆడపిల్లలైతే మరీ ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మా తండాకు రోడ్డు సౌకర్యం కల్పించి పాఠశాల ఏర్పాటు చేయాలి.

- దేవమ్మ, తూర్పుతండా, వనపర్తి మండలం